సాక్షి గుంటూరు

శుక్రవారం । 28 । మార్చి । 2025



శ్రీ మదేలేశ్వర స్వామికి బోనాలు

గురజాల: మండలంలోని పులిపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీ మదేలేశ్వర స్వామికి గురువారం భక్తులు బోనాలు సమర్పించారు.



ఈవీఎం గోడౌన్ తనిఖీ

ఫిరంగిపురం: రేపూడి వ్యవసాయ మార్కెట్ యార్డులో ఈవీఎంలు, వీవీప్యాడ్స్ భద్రపరచిన గోడౌన్‌ను డీఆర్‌ఓ ఎన్.షేక్ ఖాజావలి గురువారం తనిఖీ చేశారు.

అమ్మవార్లకు నిత్య పూజలు



భట్టిప్రోలు: భట్టిప్రోలు మండలం పెదపులివర్రు గ్రామ దేవత గోగులమ్మకు గురువారం నిత్య పూజలు నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.



న్యూస్‌రీల్

పరమ పదనాథుడు అలంకారంలో నారసింహుడు



మంగళగిరి టౌన్: మంగళాద్రిలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆస్థాన అలంకారోత్సవాల్లో భాగంగా గురువారం పరమ పద నాథుడు అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. అధిక సంఖ్యలో స్వామిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈవో రామకోటిరెడ్డి పర్యవేక్షించారు. ఉత్సవ కై ంకర్యపరులుగా ఆత్మకూరుకు చెందిన మురికిపూడి మాధవరావు కుమారులు, ఆస్థాన కైంకర్యపరులుగా మంగళగిరి పట్టణానికి చెందిన లంకా కృష్ణమూర్తి వ్యవహరించారు.

వట్టిచెరుకూరు హాస్టల్ వార్డెన్‌ను సస్పెండ్ చేయండి

మంత్రి సవిత ఆదేశం

సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు బీసీ హాస్టల్ విద్యార్థి కిశోర్ చెరువులో పడి దుర్మరణం పాలవ్వడంపై రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. విద్యార్థులపై పర్యవేక్షణ లేకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించిన హాస్టల్ వార్డెన్ శారదారాణిని తక్షణమే సస్పెండ్ చేయాలని మంత్రి ఆదేశించారు. చేతి కందికొచ్చిన కొడుకు మృతి చెందడం బాధాకరమని, మృతుడి తల్లిదండ్రుల కడుపుకోత వర్ణనాతీతమని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థి తల్లిదండ్రులకు మంత్రి సవిత ప్రగాఢ సానుభూతి తెలిపారు. దుర్ఘటనకు గల కారణాలపై విచారణకు ఆదేశించామని తెలిపారు.

రాజధాని ముఖ ద్వారంలో మరో దారుణం

- గుర్తు తెలియని వ్యక్తిని కొట్టి చంపిన స్థానికులు
- ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం



తాడేపల్లి రూరల్: రాజధాని ముఖ ద్వారమైన కె.ఎల్.రావు కాలనీలో మద్యం మత్తులో కొంతమంది యువకులు దారుణానికి పాల్పడ్డారు. గుర్తు తెలియని వ్యక్తిని గురువారం రాత్రి విచక్షణా రహితంగా కొట్టి చంపి, ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. సేకరించిన వివరాల ప్రకారం.. ప్రకాశం బ్యారేజ్ మంగళగిరి రోడ్డులో కేఎల్‌రావు కాలనీ హోసన్నా ప్రార్థన మందిరం ఎదుట కింద భాగంలో రాత్రి 7.30 సమయంలో ఓ యువకుడు రోడ్డుపై సంచరిస్తూ ఉన్నాడు. ఈ సమయంలో మద్యం తాగి రోడ్డుపై తిరుగుతున్న ఓ ఆటోడ్రైవర్ కుమారుడు అతడితో గొడవకు దిగాడు. సరిగా సమాధానం చెప్పకపోవడంతో విచక్షణా రహితంగా దాడి చేశాడు. అక్కడే ఉన్న కొంతమంది స్నేహితులు కూడా ఆ యువకుడిపై మరోసారి దాడిచేశారు. కాళ్లు పట్టుకుని ఏడ్చినా సరే వదలకుండా కాళ్లతో, చేతులతో పిడిగుద్దులు గుద్దడంతో ఆ యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. చనిపోయిన వ్యక్తి ఎవరు అనేది కూడా అక్కడ ఉన్న వారికి తెలియదు. ఇదిలా ఉండగా కాలువలో చనిపోతే పైకి తీసుకు వచ్చినట్లు చిత్రీకరించారు. ఎట్టకేలకు స్థానికులు తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని దర్యాప్తు చేపట్టారు. స్థానికులు మాత్రం ఎవరు కొట్టారు అనే విషయాన్ని వెల్లడి చేసేందుకు భయభ్రాంతులకు గురవుతున్నారు.

కాలకూటమి ఎత్తులు చిత్తు

జిల్లావ్యాప్తంగా జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయకేతనం ఎగరేసింది. ప్రజల్లో తన బలాన్ని చాటింది. కుట్రలు కుతంత్రాలు, పోలీసులతో బెదిరింపులు, డబ్బులతో సత్తా చాటాలని చూసిన కూటమి నేతలకు భంగపాటు ఎదురైంది. కూటమి నక్క జిత్తులను వైఎస్సార్ సీపీ నేతలు ఐకమత్యంతో అడ్డుకట్ట వేశారు. ప్రజా క్షేత్రంలో తమకు తిరుగు లేదని చాటి చెప్పారు. ఎంపీటీసీలను కొనుగోలు చేసి తమ ఆధిక్యతను నిరూపించుకోవాలని చూసిన కూటమి నేతలకు నిరాశే ఎదురైంది. ఐకమత్యంతో, కలసికట్టుగా వైఎస్సార్ సీపీ నేతలు వ్యవహరించడంతో కాల'కూటమి' నేతల పాచికలు పారలేదు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ హవా

- గుంటూరు రూరల్ మండలం వైస్ ఎంపీపీగా వైఎస్సార్ సీపీ అభ్యర్థి రమేష్ ఏకగ్రీవం
- ఎంపీటీసీ సభ్యుల కిడ్నాప్‌కు ప్రయత్నించిన కూటమి నేతలు
- పోలీసులతో బెదిరింపులు, డబ్బుతో కొనుగోలుకు యత్నం
- ఎత్తుకు పైఎత్తులతో ఏకగ్రీవంగా ఎన్నికైన వైఎస్సార్ సీపీ అభ్యర్థి



ఏకగ్రీవంగా వైస్ ఎంపీపీగా ఎన్నికైన కాకాని రమేష్‌ను అభినందిస్తున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

గుంటూరు రూరల్: రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ప్రకారం గురువారం ఎన్నిక నిర్వహించేందుకు మండల స్పెషల్ ఆఫీసర్ వజ్రశ్రీ, ఎంపీడీవో బి. శ్రీనివాసరావు ఆదేశాలను జారీ చేశారు. దీంతో రూరల్ మండలంలో వైస్ ఎంపీపీ పదవి కోసం కూటమి, వైఎస్సార్ సీపీలు పోటాపోటీగా తలపడ్డాయి. కూటమికి చల్లావారిపాలెం గ్రామానికి చెందిన ఎంపీటీసీ ఇండిపెండెంట్‌గా పోటీ చేసి గెలవగా, జొన్నలగడ్డకు చెందిన ఎంపీటీసీ ఒకరు ఉన్నారు. ఇద్దరితో బలం సరిపోక కూటమి నేతలు కుట్రలకు తెరతీశారు. బెదిరింపులు, డబ్బుతో వెంగళాయపాలెం గ్రామానికి చెందిన ఒక ఎంపీటీసీని కలుపుకున్నారు. దీంతో కూటమికి బలం మూడుకు పెరిగింది. మండలంలో మొత్తం ఏడు ఎంపీటీసీ స్థానాలు ఉండగా, అందులో ఐదు స్థానాలను వైఎస్సార్ సీపీ కైవశం చేసుకుంది. ఈ నేపథ్యంలో కూటమి కుట్రలకు ఒక ఎంపీటీసీ పార్టీ మారగా వైఎస్సార్ సీపీ విప్ జారీ చేసింది. ఒక ఎంపీటీసీని కోల్పోయినప్పటికి నాలుగు స్థానాలతో వైఎస్సార్ సీపీ ఏకగ్రీవంగా వైస్ ఎంపీపీ స్థానాన్ని కైవశం చేసుకుంది.

తోక ముడిచిన కూటమి నేతలు

ఎన్నిక జరుగుతున్న సమయంలో ఎంపీటీసీలను కిడ్నాప్ చేసేందుకు కూటమి నేతలు కుట్రలు పన్నారు. కుటుంబ సభ్యులను భయాందోళనకు గురిచేసి, బెదిరించి మండల పరిషత్ కార్యాలయానికి తెచ్చారు. ఎలాగైనా ఒక ఎంపీటీసీనైనా కిడ్నాప్ చేసి, ఎన్నిక జరగకుండా చేయాలని లేదా డ్రా చేయాలని ప్రయత్నాలు చేశారు. కూటమి నేతలు ఎన్ని కుట్రలు పన్నినా వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు బెదరలేదు. అంతా మండల పరిషత్‌లోని సమావేశ మందిరానికి చేరుకున్నారు. దీంతో వైఎస్సార్ సీపీ ఎంపీటీసీలు ఎన్నికల కేంద్రానికి చేరుకోవడంతో కూటమి నేతలు అక్కడినుంచి జారుకున్నారు. కనీసం ఉన్న ముగ్గురు ఎంపీటీసీలు కూడా ఎన్నికకు హాజరవ్వకుండా తోకముడిచి వెళ్లిపోయారు. దీంతో వైఎస్సార్ సీపీ అభ్యర్థి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఎన్నిక జరిగిందిలా....

వైఎస్ ఎంపీపీ ఎన్నికకు ఎన్నికల అధికారిగా, మండల స్పెషల్ ఆఫీసర్ ఎల్. వజ్రశ్రీ వ్యవహరించారు. ఉదయం 11 గంటలకు వైఎస్సార్ సీపీకి చెందిన ఎంపీటీసీలు ఎంపీపీ ఇంటూరి పద్మావతి, వైఎస్ ఎంపీపీ దర్శి సుజాత, పులగం దివ్య, కాకాని రమేష్, కోఆప్షన్ సభ్యుడు కరీముల్లాలు చేరుకున్నారు. ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు కాకాని రమేష్ నామినేషన్‌ను ఎన్నికల అధికారికి అందజేశారు. అనంతరం ఆయన్ను ఎంపీటీసీ, ఎంపీపీ ఇంటూరి పద్మావతి ప్రతిపాదించగా, ఎంపీటీసీ, వైఎస్ ఎంపీపీ దర్శి సుజాత బలపరిచారు. అనంతరం ఎన్నికల నిబంధనల ప్రకారం కూటమి నేతలు ఎన్నికకు హాజరుకాకపోవడం, కాకాని రమేష్ మాత్రమే నామినేషన్‌ను దాఖలు చేయడంతో ఎన్నికల అధికారి వజ్రశ్రీ అధికారికంగా ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. అనంతరం నియామక పత్రాన్ని అందజేశారు. ఏకగ్రీవంగా ఎన్నికైన వైఎస్ ఎంపీపీ కాకాని రమేష్‌ను వైఎస్సార్ సీపీ నేతలు, మండల పరిషత్ అధికారులు అభినందించారు. ఘనంగా శాలువాలు కప్పి పూలమాలలతో సత్కరించారు.

దుగ్గిరాల ఎంపీపీగా షేక్ జబీన్ ఏకగ్రీవం

దుగ్గిరాల: స్థానిక మండల పరిషత్ అధ్యక్షుడి ఎన్నిక గురువారం సమావేశ మందిరంలో నిర్వహించారు. డ్వామా పీడీ శంకర్ ప్రిసైడింగ్ అధికారిగా వ్యవహరించారు. టీడీపీ చెందిన ఎంపీటీసీ సభ్యులు తొమ్మిది మంది, జనసేన సభ్యులు ఒకరు, కోఆప్షన్ సభ్యులు ఒకరు ఎన్నికలో పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ సభ్యులంతా గైర్హాజర్ అయ్యారు. ముందుగా సమావేశంలో కోరం సభ్యులు సరిపోగా ఎన్నిక ప్రారంభించారు. గొడవర్రు ఎంపీటీసీ శివకుమార్ లేచి జబీన్‌ను అధ్యక్షురాలిగా ప్రతిపాదించారు. దీన్ని మధుబాబు బలపరిచారు. ఒక్క నామినేషన్ మాత్రమే రావడంతో జబీన్ ఎన్నిక ఏకగ్రీవమైంది. కార్యక్రమంలో ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు, తహసీల్దార్ ఐ.సునీత పాల్గొన్నారు. అల్లర్లు జరగకుండా పోలీసులు 144 సెక్షన్ అమలు చేశారు. ఎస్‌ఐ వెంకట రవి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మంచికలపూడిలో ఉప సర్పంచిగా పులి కోటేశ్వరరావు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఎన్నికల అధికారి కె.జె.నెహ్రూ తెలిపారు



జబీన్‌కు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న పీడీ శంకర్

బ్రాహ్మణకోడూరు ఉప సర్పంచిగా నాగ మల్లేశ్వరరావు

పొన్నూరు : మండలంలోని బ్రాహ్మణకోడూరు ఉప సర్పంచిగా ఓసూరి నాగమల్లేశ్వరరావు ఎన్నికయ్యారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో గురువారం జరిగిన ఎన్నికలో ఒక నామినేషన్ మాత్రమే రావడంతో గ్రామ మూడో వార్డు సభ్యుడైన నాగమల్లేశ్వరరావు ఉప సర్పంచ్‌గా ఎన్నికైనట్లు ప్రిసైడింగ్ అధికారి, ఎంపీడీఓ జి. చంద్రశేఖరరావు ప్రకటించారు. అనంతరం ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందజేసి ప్రమాణం చేయించారు.



నాగమల్లేశ్వరరావుకు ఎన్నిక పత్రం అందిస్తున్న ఎంపీడీఓ

శ్రీరంగపురం ఉప సర్పంచ్‌గా నాగమ్మ



నాగమ్మకు ధ్రువీకరణ పత్రాన్ని అందిస్తున్న ఈవోపీఆర్డీ ఉషారాణి

శ్రీరంగపురం(చేబ్రోలు): చేబ్రోలు మండలం శ్రీరంగపురం గ్రామ పంచాయతీ ఉప సర్పంచ్‌గా వైఎస్సార్ సీపీకి చెందిన పోతురాజు నాగమ్మ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఉదయం ఈవోపీఆర్డీ టి. ఉషారాణి పర్యవేక్షణలో ఎన్నికను నిర్వహించారు. పంచాయతీ ఒకటో వార్డు మెంబరు పోతురాజు నాగమ్మను సభ్యులందరూ ఆమోదించడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు అధికారులు ప్రకటించారు. ఎన్నికల అధికారి ఉషారాణి నాగమ్మకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అనంతరం ఉప సర్పంచ్‌గా ప్రమాణస్వీకారం చేయించారు. ఏకగ్రీవంగా ఎన్నికైన నాగమ్మను గ్రామ సర్పంచ్ జాస్తి సాంబశివరావు, తిరుమలశెట్టి బాల, చెరుకూరి భాస్కరరావు, పి. శివశంకర్, వైఎస్సార్ సీపీ నాయకులు అభినందించారు.

భవిష్యత్‌లోనూ ఐక్యంగా కొనసాగుతాం

- మాజీ ఎమ్మెల్యే శివకుమార్
- మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుని ఏకగ్రీవ ఎన్నిక

తెనాలి: స్థానిక మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడిగా తేలప్రోలుకు చెందిన ముస్లిం మైనారిటీ నాయకుడు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త సయ్యద్ జానీబాషా ఏకగ్రీవ ఎన్నిక పార్టీ ఐక్యతకు నిదర్శనమని మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. మండల పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడిగా ఎన్నికైన సయ్యద్ జానీబాషా, ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, పార్టీ మండల అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, పార్టీ ఎంపీటీసీలతో కలిసి గురువారం స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌ను కలిశారు. సయ్యద్ జానీబాషాను ఆయన అభినందించి శాలువతో సత్కరించారు. జానీబాషా ఏకగ్రీవ ఎన్నిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ బలాన్ని బహిర్గతం చేస్తోందని తెలిపారు. గత స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ 18 ఎంపీటీసీ స్థానాలను గెలుచుకుందని గుర్తుచేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ, తాను ఓటమి చెందినప్పటికీ ఎంపీపీ, ఎంపీటీసీలు ఏకతాటిపై ఉండటంతో కో–ఆప్షన్ ఏకగ్రీవమైందని చెప్పారు. ఇందుకు కారకులైన ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశులు, మండల పార్టీ అధ్యక్షుడు శ్రీనివాసరావు, ఎంపీటీసీలను అభినందించారు. జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని గత ప్రభుత్వం రాజ్యాధికారంలో అన్ని సామాజికవర్గాలకు స్థానం కల్పించినట్లు చెప్పారు. తెనాలి నియోజకవర్గంలోనూ ఆ సామాజిక సమతుల్యతను పాటించామని శివకుమార్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ ఓటమి చెందినప్పటికీ ముందు చెప్పినట్టుగా, తేలప్రోలుకు చెందిన మైనారిటీ సోదరుడు జానీబాషాకు ఇచ్చామని తెలిపారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరుడి ఎంపిక అల్లా ఆశీర్వాదం అనుకుంటున్నామని అన్నారు. ఇదే తరహాలో భవిష్యత్‌లోనూ అంతా కలసికట్టుగా జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో ప్రజలపక్షాన పోరాడతామని శివకుమార్ స్పష్టం చేశారు. గత అయిదేళ్లలో పేదవాడికి గరిష్టంగా సంక్షేమం ఇచ్చామని చెప్పారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తేలప్రోలు సర్పంచ్ షేక్ బాషా, ఎంపీటీసీలు షేక్ ఇలియాస్, దోనపాటి నాగదేవిక, కాలిశెట్టి వెంకట మారుతీఫణికుమార్, ఇసుకపల్లి సుందరరావు, సంకురు బుజ్జిబాబు, పఠాన్ ఖాసింఖాన్, షేక్ ముజీర్, షేక్ గాలబ్, షేక్ జానీ, షేక్ మస్తాన్, షేక్ నాగురా, షేక్ సలీం, షేక్ మున్నా, షేక్ సుభాని పాల్గొన్నారు.



సయ్యద్ జానీ బాషాను సత్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

వాయిదాల మీద వాయిదా

- జెడ్పీ సర్వసభ్య సమావేశం మరోసారి వాయిదా
- షెడ్యూల్ ప్రకారం ఈనెల 29న జరగాలి
- అదే రోజు టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం
- టీడీపీ ఎంపీలు, ఎమ్మెల్యేలు అందుబాటులో ఉండకపోవడంతో వాయిదా నాటకం
- జెడ్పీటీసీ సభ్యులకు ఫోన్లు చేసి గుంటూరుకు ఆహ్వానించిన చైర్‌పర్సన్ హెనీ క్రిస్టినా
- సమావేశాన్ని వాయిదా వేసేందుకు వీలుగా సంతకాలు చేయాలని బుజ్జగింపులు
- ఎట్టకేలకు నగం మంది సభ్యులు ఆమోదించడంతో వాయిదా వేసిన సీఈవో

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం మరోసారి వాయిదా పడింది. షెడ్యూల్ ప్రకారం ఈనెల 29న జరగాలి. మెజార్టీ సభ్యులు కోరిన మీదట వాయిదా వేస్తున్నట్లు జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసు గురువారం సాయంత్రం ప్రకటించారు. జెడ్పీ ఆర్థిక సంవత్సర బడ్జెట్‌ను ఆమోదించేందుకు ఈనెల 15న కొలువుదీరిన సమావేశం కోరం లేక వాయిదా పడింది. ఈ నేపథ్యంలో కీలకమైన బడ్జెట్ ఆమోదం కోసం ఈనెల 29న మరోసారి సమావేశాన్ని నిర్వహించేందుకు మూడు జిల్లాలకు చెందిన జెడ్పీటీసీ సభ్యులతో పాటు ఇతర ప్రజా ప్రతినిధులు, అధికారులకు సమాచారాన్ని పంపారు. మార్చి 31లోపు సర్వసభ్య సమావేశాన్ని ఏర్పాటు చేసి, బడ్జెట్‌ను ఆమోదించాల్సిన కీలక సమయంలో మరోసారి వాయిదా వేశారు. సభ్యుల గైర్హాజరుతో వాయిదా పడిన రెండు వారాల వ్యవధిలో ఏర్పాటు చేసిన రెండవ సమావేశాన్ని సైతం వాయిదా వేయడంపై అధికారుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జెడ్పీని పరిపాలిస్తున్న వారు ప్రజలకు ఏం మెసేజ్ ఇస్తున్నారో వారికే తెలియాలని అంటున్నారు.

అడ్డొచ్చిన టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం

ఈనెల 29న టీడీపీ వ్యవస్థాపక దినోత్సవం దృష్ట్యా అదే రోజు జరగాల్సిన జెడ్పీ సర్వసభ్య సమావేశాన్ని వాయిదా వేశారు. ఆ రోజున ఏర్పాటు చేస్తే తాము హాజరు కాబోమని టీడీపీకి చెందిన ప్రజా ప్రతినిధులు చెప్పారు. దీంతో సమావేశాన్ని నిర్వహించలేమనే సాకుతో చైర్‌పర్సన్ కత్తెర హెనీ క్రిస్టినా వాయిదా వేయడమే ఏకైక లక్ష్యంగా జెడ్పీటీసీ సభ్యులకు ఫోన్లు చేసి గురువారం గుంటూరులోని జెడ్పీకి పిలిపించుకున్నారు. వారికి విందు ఏర్పాట్లు చేసి సమావేశాన్ని వాయిదా వేసేందుకు సహకరించాల్సిందిగా బుజ్జగించారు. సమావేశాన్ని వాయిదా వేసేందుకు 50 శాతం సభ్యుల అంగీకారం అవసరం ఉండటంతో ఈ విధమైన ప్రయత్నాలు చేశారు. చైర్‌పర్సన్ ఆహ్వానం మేరకు గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల నుంచి వచ్చిన కొంత మంది జెడ్పీటీసీ సభ్యులు మెత్తపడ్డారు. ఎట్టకేలకు సమావేశాన్ని వాయిదా వేసేందుకు అంగీకరిస్తూ, సంతకాలు చేశారు. దీనిపై జెడ్పీ సీఈవో వి. జ్యోతిబసును వివరణ కోరగా జెడ్పీలో ఓటు హక్కు కలిగిన మొత్తం 82 మంది సభ్యుల్లో 50 శాతానికి పైగా సభ్యులు సంతకాలు చేయడంతో వాయిదా వేస్తున్నట్లు చెప్పారు. మరలా ఎప్పుడు నిర్వహించేదీ తదుపరి తెలియజేస్తామని చెప్పారు. కాగా కొంత మంది జెడ్పీటీసీ సభ్యులు వ్యక్తిగతంగా హాజరు కాగా, సమావేశ వాయిదా కోరుతూ పలువురు ఎమ్మెల్యేలు లేఖలు పంపించారు.



గుంటూరు జిల్లా పరిషత్ భవనం (ఫైల్)

కార్మికులకు బీమా తప్పనిసరి

కార్మిక శాఖ అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు

గుంటూరు ఎడ్యుకేషన్: పది మందికి పైగా కార్మికులు పని చేస్తున్న సంస్థల యాజమాన్యాలు విధిగా వారితో బీమా చేయించాలని రాష్ట్ర కార్మిక, కర్మాగార, బాయిలర్స్, బీమా, మెడికల్ సర్వీసెస్ అదనపు కార్యదర్శి గంధం చంద్రుడు ఆదేశించారు. జెడ్పీ సమావేశ మందిరంలో గురువారం జోనల్ సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న గంధం చంద్రుడు మాట్లాడుతూ 10 మందికి పైగా కార్మికులతో పాటు రూ.21వేల కంటే తక్కువగా వేతనం పొందుతున్న వారిని ఇన్సూయర్డ్ పర్సన్లుగా నమోదే చేయించడంలో చర్యలు తీసుకోవాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. అసంఘటిత రంగ కార్మికులంతా ఈ–శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకునే విధంగా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గిగ్, ప్లాట్‌ఫారం వర్కర్స్‌ను వారి సంస్థల్లో ఈ–శ్రమ్ పోర్టల్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన మాడ్యూల్‌లో నమోదు చేయించాలని సూచించారు. గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో కార్మిక శాఖ అధికారుల తనిఖీల్లో గుర్తించిన బాలల సంఖ్య తక్కువగా ఉందని తెలిపారు. నెలాఖరులోపు విస్తృతంగా దాడులు నిర్వహించి, కనుగొన్న బాలలకు చట్టపరంగా రక్షణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలలతో పని చేయిస్తున్న యాజమాన్యాలపై చట్ట పరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. జోన్ పరిధిలో కేసుల సత్వర పరిష్కారం, ఈ–శ్రమ్ ఎక్స్‌గ్రేషియా కేసులు, ఇతర కార్యకలాపాల పురోగతిపై చర్చించారు.

సుష్మ..యూ ఆర్ గ్రేట్ !

- బ్రెయిన్ డెడ్ అయిన మహిళ చెరుకూరి సుష్మ అవయవ దానం
- పెద్ద మనస్సుతో అంగీకరించిన కుటుంబసభ్యులు

గుంటూరు మెడికల్: బ్రెయిన్ డెడ్ అయిన మహిళ అవయవాలను కుటుంబసభ్యులు దానం చేశారు. అవయవాలను వైద్యులు ప్రత్యేక విమానంలో పలు ఆసుపత్రులకు తరలించి పలువురికి ప్రాణదానం చేశారు. వివరాల్లోకి వెళితే.. గుంటూరు స్తంభాలగరువు ఎల్ఐసీ కాలనీకి చెందిన చెరుకూరి సుష్మ (47) అనారోగ్యంతో ఈనెల 23న గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో చేరారు. చికిత్స పొందుతూ బ్రెయిన్ డెడ్ అవడంతో కుటుంబ సభ్యులు అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చారు. ఇతర ప్రాంతాలకు తరలించేందుకు ఆస్టర్ రమేష్ హాస్పటల్ యాజమాన్యం మంత్రి నారా లోకేష్‌ను సంప్రదించారు. వెంటనే ఆయన ప్రత్యేక విమానాన్ని గన్నవరంలో ఏర్పాటు చేయించారు. రమేష్ హాస్పిటల్ నుంచి గ్రీన్ చానల్ ద్వారా అవయవాలను ఇతర ప్రాంతాలకు తరలించారు. తిరుపతి శ్రీ పద్మావతి చిల్డ్రన్స్ హార్ట్ హాస్పిటల్‌కు గుండెను, చెన్నై ఎంజీఎం హాస్పిటల్‌కు ఊపిరితిత్తులను, విజయవాడ కామినేని హాస్పటల్‌కు ఒక కిడ్నీ, గుంటూరు ఆస్టర్ రమేష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న రోగికి కిడ్నీ, ఒకరికి లివర్ అమర్చి వారికి ప్రాణదానం చేశారు. ఈ ప్రక్రియలో రమేష్ హాస్పిటల్ డెప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాయపాటి మమత, బిజినెస్ క్లస్టర్ హెడ్ డాక్టర్ యలవర్తి కార్తిక్ చౌదరి, నెఫ్రాలజిస్ట్ డాక్టర్ సాయికుమార్, ఐసీయూ స్పెషలిస్ట్ డాక్టర్ శిల్ప పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుష్మ కుమార్తెలు తేజస్విని, వైష్ణవి, వెనుక భర్త చెరుకూరి శ్రీనివాస్



ఊపిరితిత్తులను చెన్నైకు తరలిస్తున్న వైద్యులు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు



గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో గురువారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్టం : రూ. 6,000 గరిష్టం : రూ. 8,200

మోడల్ ధర రూ. 7,000

క్లుప్తంగా

వైద్య కళాశాలకు రూ. 10 లక్షల విరాళం

లలిత గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రాఘవశర్మ అందజేత



గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల అభివృద్ధికి సీనియర్ కార్డియాలజిస్ట్, గుంటూరు లలిత గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి.వి.రాఘవశర్మ రూ. 10 లక్షలను విరాళంగా అందజేశారు. వైద్య కళాశాలలో బయో కెమిస్ట్రీ విభాగం, పీజీ రీసెర్చ్ ల్యాబ్ ఆధునికీకరణ, వైద్య పరికరాలను అందించారు. ఈ నిధులతో ఆధునీకరించిన ల్యాబ్‌ను, నూతన వైద్య పరికరాలను గురువారం గుంటూరు వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎన్.వి.సుందరాచారి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కళాశాల అభివృద్ధికి పూర్వ విద్యార్థులు, నగరానికి చెందిన పలువురు వైద్యులు విరాళాలు అందించడం అభినందనీయమని తెలిపారు. వైద్య విద్యార్థులకు కార్పొరేట్ తరహాలో ఆధునిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. బయోకెమిస్ట్రీలో ఏర్పాటు చేసిన నూతన వైద్య పరికరాలతో పలు వ్యాధులను నిర్ధారణ చేయవచ్చని, పీజీ వైద్యులకు కూడా ఎంతో ఉపయోగంగా ఉంటుందని తెలిపారు. డాక్టర్ రాఘవశర్మను అభినందించి సన్మానించారు. డాక్టర్ రాఘవశర్మతోపాటు బయోకెమిస్ట్రీ అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ మోహనలక్ష్మి తన సోదరుడు జి.హెచ్.వి.రాఘవ జ్ఞాపకార్థం రూ. 4లక్షలను వైద్య పరికరాలకు అందించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ సుందరాచారి ఆమెను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ శ్రీధర్, డాక్టర్ ప్రభాకర్, బయో కెమిస్ట్రీ హెచ్‌ఓడీ డాక్టర్ సునీతలక్ష్మి పాల్గొన్నారు.

రూ.46 కోట్లతో జీడీసీసీబీ అంచనా బడ్జెట్

ప్రవేశపెట్టిన బ్యాంక్ సీఈఓ కృష్ణవేణి



సమావేశానికి హాజరైన పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలు



సమావేశంలో బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్న జీడీసీసీ బ్యాంక్ సీఈఓ కృష్ణవేణి, వేదికపై జేసీ భార్గవ్ తేజ

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్(జీడీసీసీబీ) మహాజన సభ సమావేశాన్ని బ్రాడీపేటలోని ప్రధాన కార్యాలయంలో ఆ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ అధ్యక్షతన గురువారం నిర్వహించారు. సీఈఓ టి.కృష్ణవేణి 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి జమ, ఖర్చులు చదివి వినిపించారు. 2025–26 ఆర్థిక సంవత్సరానికి రూ.46 కోట్లతో అంచనా బడ్జెట్‌ను సభ ముందుంచారు. దీన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. దీంతోపాటు పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా సీఈఓ కృష్ణవేణి మాట్లాడుతూ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల్లో రైతులకు ఇచ్చిన రుణాలను త్వరితగతిన వసూలు చేయాలని సూచించారు. 2024–25లో జీడీసీసీ బ్యాంక్ రూ.25 కోట్లు లాభం ఆర్జించిందని ఆమె ప్రకటించారు. పీఏసీఎస్, జీడీసీసీ బ్యాంక్ బ్రాంచిల్లో ఎన్‌పీఏ తగ్గించాలని, రుణాల రికవరీలో అభ్యంతరాలు ఉంటే న్యాయపరంగా ముందుకు వెళ్లాలని సూచించారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 167 పీఏసీఎస్‌ల్లో ఇప్పటి వరకు 127 సంఘాల్లో కంప్యూటరీకరణ పూర్తయిందని, మిగిలిన 40 సంఘాల్లో కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సీఈఓ కృష్ణవేణి అంచనా బడ్జెట్ ప్రవేశపెట్టిన తర్వాత జీడీసీసీ బ్యాంక్ పర్సన్ ఇన్‌చార్జి, జిల్లా జాయింట్ కలెక్టర్ భార్గవ్ తేజ 'ఏనీ అబ్జక్షన్స్' అంటూ సభ్యులను వివరణ కోరారు. అభ్యంతరాలు ఏమీ లేవని చెప్పడం తో మహాజన సభ సమావేశాన్ని 10 నుంచి 15 నిమిషాల్లో ముగించి వేశారు. సమావేశంలో పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జిలు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

8 నుంచి సప్త జ్యోతిర్లింగ దర్శన్ యాత్ర



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజా తదితరులు

లక్ష్మీపురం: విజయవాడ నుంచి సప్త (7) జ్యోతిర్లింగ దర్శనం చేసే భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును ఏప్రిల్ 8వ తేదీనుంచి నడపనున్నట్లు ఐఆర్‌సీటీసీ ఏరియా మేనేజర్ ఎం.రాజా తెలిపారు. గుంటూరు రైల్వే స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సప్త జ్యోతిర్లింగ దర్శన యాత్రలో ఉజ్జయినిలో మహాకాళేశ్వర్, ఓంకారేశ్వర్, ద్వారకలో నాగేశ్వర్, సోమనాథ్‌లో సోమనాథ్, పూణేలో భీమశంకర్, నాసిక్‌లో త్రయంబకేశ్వరుడు, ఔరంగాబాద్‌లో గ్రిష్ణేశ్వర్‌ను చూడవచ్చని తెలిపారు. యాత్ర ఏప్రిల్ 8వ తేదీ నుంచి 19వ తేదీ వరకు 11రాత్రులు, 12 రోజులు ఉంటుందని వివరించారు. రైలు విజయవాడ నుంచి, ఖమ్మం, కాజీపేట, సికింద్రాబాద్ మీదుగా ప్రయాణిస్తుందని చెప్పారు. స్లీపర్ క్లాస్‌లో పెద్దలకు రూ.20,890, 5నుంచి 11 సంవత్సరాల చిన్నారులకురూ.19,555 ధర ఉంటుందని పేర్కొన్నారు. రాత్రి హోటల్‌లో బస నాన్ ఏసీ, రవాణా నాన్ ఏసీ వాహనంలో ఉంటాయని తెలిపారు. త్రీ టైర్ ఏసీలో అయితే పెద్దలకు రూ.33,735, 5నుంచి 11 సంవత్సరాల చిన్నారులకు రూ.32,160 ధర ఉంటుందన్నారు. హోటల్‌లో రాత్రి బస ఏసీ రూమ్, రవాణా నాన్ ఏసీ వాహనంలో ఉంటుందన్నారు. టూ టైర్ ఏసీలో అయితే పెద్దలకు రూ.44,375, 5నుంచి 11 సంవత్సరాల చిన్నారులకు రూ.42,485తో పాటు ఏసీ హోటల్, రవాణా ఏసీ వాహనంలో ఉంటుందని తెలిపారు. అన్ని శాకాహార భోజనాలు, ఉదయం టీ, అల్పాహారం, భోజనం, రాత్రి భోజనం, ప్రయాణీకులకు బీమా, వృత్తిపరమైన, స్నేహపూర్వక పర్యటన సహాయం కోసం ఐఆర్‌సీటీసీ టూర్ మేనేజర్ అందుబాటులో ఉంటారని తెలిపారు. అలాగే రైళ్లో భద్రత, అవసరమైన సహాయం కోసం ఐఆర్‌సీటీసీ టూర్ మేనేజర్ అందుబాటులో ప్రయాణిస్తారని పేర్కొన్నారు. అన్ని రకాల పన్నులు వర్తిస్తాయన్నారు. మరిన్ని వివరాల కోసం ఆన్‌లైన్ బుకింగ్ ఐఆర్‌సీటీసీ వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు. ఇతర వివరాల 9281495848, 9281030714 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. అనంతరం సప్తలింగ దర్శన యాత్ర బ్రోచర్‌ను ఆవిష్కరించారు.

యార్డులో 1,44,863 బస్తాలు మిర్చి విక్రయం

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు గురువారం 1,41,161 బస్తాల మిర్చి రాగా గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 1,44,863 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల సగటు ధర రూ.9,500 నుంచి రూ.14,100 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.10,000 నుంచి రూ.13,300 వరకు ధర లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.6,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 66,873 బస్తాల నిల్వ ఉన్నట్లు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఎ.చంద్రిక తెలిపారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్



తాడేపల్లి రూరల్: వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర విభాగ ప్రధాన కార్యదర్శిగా మంగళగిరి అసెంబ్లీ నియోజకవర్గానికి చెందిన ముదిగొండ ప్రకాష్ నియమితులయ్యారు. ఈ మేరకు వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ కార్యాలయం ప్రకటన విడుదల చేసింది. ఈ సందర్భంగా ముదిగొండ ప్రకాష్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు, మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి, తాడేపల్లి పట్టణ అధ్యక్షుడు బుర్రముక్క వేణుగోపాలసోమిరెడ్డి తనమీద నమ్మకంతో ఈ పదవిని ఇచ్చారని తెలిపారు. భవిష్యత్తులో వైఎస్సార్ సీపీ బలోపేతం కోసం కృషిచేస్తానని పేర్కొన్నారు.

జీడీసీఎంఎస్‌ను ప్రథమ స్థానంలో నిలపాలి

పర్సన్ ఇన్‌చార్జి, జేసీ భార్గవ్ తేజ



బడ్జెట్‌ను చదివి వినిపిస్తున్న బిజినెస్ మేనేజర్ హరిగోపాలం, పక్కన పర్సన్ ఇన్‌చార్జి భార్గవ్

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు జిల్లా కో–ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ(జీడీసీఎంఎస్)ను అన్ని రంగాల్లో రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలపాలని పర్సన్ ఇన్‌చార్జి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్ తేజ తెలిపారు. స్థానిక కన్నావారితోటలోని జీడీసీఎంఎస్ కార్యాలయంలో గురువారం జరిగిన మహాజన సభ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల(పీఏసీఎస్)ను లాభాల్లో నడిపించాలని చెప్పారు. ముందుగా బిజినెస్ మేనేజర్ డి.హరిగోపాలం 2025–26 ఆర్థిక సంవత్సరానికి గాను రూ.6.21 కోట్లతో అంచనా బడ్జెట్‌ను ప్రవేశపెట్టగా, సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2024–25లో జిల్లాలోని 44 జీడీసీఎంఎస్ బ్రాంచ్‌లు, పలు పీఏసీఎస్‌ల ద్వారా రూ.81 కోట్లు విలువైన ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు, నోటు పుస్తకాలు, స్టేషనరీ, ప్రొవిజన్స్ తదితర వ్యాపారాలు చేసినట్లు పేర్కొన్నారు. 2024–25 ఖరీఫ్ సీజన్‌లో ఏపీ సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాల్లోని 12 మండలాల్లో రూ.280 కోట్ల విలువ గల 1.20 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఏపీ మార్క్‌ఫెడ్, నాఫెడ్ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాలో కందుల కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రూ.19.19 కోట్ల విలువ గల 2,541 మెట్రిక్ టన్నులను కొనుగోలు చేసినట్లు వెల్లడించారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో రూ.2 కోట్లు లాభం ఆర్జించినట్లు ప్రకటించారు. రాబోయే రోజుల్లో మరిన్ని వ్యాపారాలు చేసి జీడీసీఎంఎస్‌ను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తామని ఆయన వెల్లడించారు. అనంతరం సమావేశంలో పలు తీర్మానాలు ప్రవేశపెట్టగా, సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదించారు. జేసీ భార్గవ్ తేజ పలు సూచనలు, తీర్మానాలపై సంతకాలు చేశారు. సమావేశంలో జీడీసీఎంఎస్ కార్యాలయ మేనేజర్ కె.శ్రీనివాసరావు, పీఏసీఎస్‌ల పర్సన్ ఇన్‌చార్జిలు పాల్గొన్నారు.

సాంకేతికతను సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలి

ఏఎన్‌యూ వీసీ గంగాధరరావు



సావనీర్ ఆవిష్కరిస్తున్న వీసీ తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: సాంకేతిక విజ్ఞానాన్ని సమాజ శ్రేయస్సు కోసం వినియోగించాలని ఏఎన్‌యూ వీసీ ఆచార్య కె.గంగాధరరావు పేర్కొన్నారు. జేకేసీ కళాశాలలో గురువారం కంప్యూటర్ రంగంలో నూతన ఆవిష్కరణ పోకడలపై ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విజ్ఞానాన్ని, సాంకేతికతను దుర్వినియోగ పరచరాదని విద్యార్థులకు సూచించారు. గతంలో కంటే విజ్ఞానశాస్త్రం ఎంతో అభివృద్ధి చెందిందని తెలిపారు. దీనిపై విద్యార్థులు, పరిశోధకులు దృష్టిసారిస్తే ఉత్తమ ఫలితాలు పొందవచ్చునని సూచించారు. కంప్యూటర్ సైన్సులో నాటి నుంచి ఇప్పటి వరకు చోటు చేసుకున్న ఆధునాతన దశల గురించి వివరించారు. విద్యాబోధన, అధ్యయనం సమాంతరంగా సాగాలని తెలిపారు. అధ్యాపకులు నిత్య విద్యార్థులుగా ఉండాలన్నారు. ఆధునిక బోధనా పద్ధతులను అందిపుచ్చుకుని విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించినప్పుడే మెరుగైన జ్ఞానాన్ని పొందుతారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా సదస్సు సావనీర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ అధ్యక్షుడు డాక్టర్ రాయపాటి శ్రీనివాస్, పీజీ కోర్సుల డైరెక్టర్ ఎస్.శ్రీనివాస్, ప్రిన్సిపాల్ పి.గోపీచంద్, వైస్ ప్రిన్సిపాల్ కె.సాంబశివరావు, సదస్సు డైరెక్టర్ డాక్టర్ యలవర్తి సుధాకర్, డాక్టర్ ప్రెసిల్లా, వెంకటేశ్వర్లు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం విఫలం

- వైఎస్సార్ సీపీ స్టూడెంట్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రవిచంద్ర
- మంత్రి లోకేష్ రాజీనామా చేయాలని డిమాండ్



విద్యాభవన్ ముందు ధర్నా నిర్వహిస్తున్న వైఎస్సార్ సీపీ స్టూడెంట్ విభాగం నాయకులు

మంగళగిరి: పదవ తరగతి పరీక్షల నిర్వహణలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రవిచంద్ర ఆరోపించారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్, లీకేజీలను అరికట్టాలంటూ శుక్రవారం గుంటూరు జిల్లా అత్యకూరు వద్ద జాతీయ రహదారి పక్కనున్న ప్రభుత్వ విద్యాభవన్ కార్యాలయం ఎదుట వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రవిచంద్ర మాట్లాడుతూ పరీక్షల నిర్వహణలో వైఫల్యానికి బాధ్యత వహిస్తూ విద్యాశాఖ మంత్రి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ఐదు సంవత్సరాల పాలనలో ఒక్క లీకేజీ కాలేదని గుర్తు చేశారు. కార్పొరేట్ విద్యాసంస్థలకు లబ్ధిచేకూర్చేందుకే పేపర్ లీకేజీ జరుగుతుందని విమర్శించారు. చంద్రబాబు పాలన అంటే ప్రశ్నపత్రాలు లీకేజీమయం అని దుయ్యబట్టారు. కడపలో మ్యాథ్స్ పేపర్ లీకేజీ ఘటనపై తొమ్మిది మందిని అరెస్ట్ చేయడం దీనికి ఉదాహరణగా చెప్పుకోవచ్చని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఆరు లక్షల మంది విద్యార్థులు పరీక్షలు రాశారని, వారంతా లీకేజీ ఘటనలతో ఆందోళన చెందుతున్నారని తెలిపారు. పరీక్షలో అక్రమాలకు పాల్పడుతున్న ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలు గుర్తింపు రద్దు చేసి క్రిమినల్ కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు కె.శివారెడ్డి, ఎ. శ్రీనివాస్, ఎం. గోపీచంద్, కొండలరావు, సురేష్, ప్రశాంత్, పూజిత, నాగరాజు, రాము, సురేంద్ర పాల్గొన్నారు.

ఫ్యాప్టో నూతన కార్యవర్గం



నరసింహారావు, జిల్లా చైర్మన్



వీరాంజనేయులు, సెక్రటరీ జనరల్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య (ఫ్యాప్టో) గుంటూరు జిల్లా చైర్మన్‌గా కె. నరసింహారావు (ఏపీటీఎఫ్–1938), సెక్రటరీ జనరల్‌గా కె. వీరాంజనేయులు (ఎస్టీయూ, ఎస్టీ సంఘం) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో గురువారం ఫ్యాప్టో జిల్లా చైర్మన్ ఎం. కళాధర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం. హనుమంతరావు ముఖ్య అతిథిగా పాల్గొని ఎన్నిక ప్రక్రియ నిర్వహించారు. ఫ్యాప్టో కో–చైర్మన్‌గా బి. సత్యం (ఫోర్మెన్), షేక్ ఫైజుల్లా (డీటీఎఫ్), డిప్యూటీ సెక్రటరీ జనరల్‌గా యు. రాజశేఖర్‌రావు (యూటీఎఫ్), బి. సుబ్బారెడ్డి (ఎస్జీయూ), ఎండీ ఖలీద్ (ఏపీటీఎఫ్–257)ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

చేనేతలందరికీ ఉచితంగా కరెంటు ఇవ్వాలి

సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ

మంగళగిరి టౌన్: చేనేతపై ఆధారపడి పనిచేస్తున్న కార్మికులందరికీ రాష్ట్ర ప్రభుత్వం ఉచిత కరెంటు పథకాన్ని అమలు జరపాలని ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి బాలకృష్ణ గురువారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు 200 యూనిట్ల ఉచిత కరెంటు జీవో విడుదల చేసిందని, ఇందులో 93 వేల మందికి మాత్రమే అమలు జరుపు తామని ప్రకటించిందని పేర్కొన్నారు. రాష్ట్రంలో సహకార సంఘాల్లో నేత నేస్తున్న వారికి, ప్రైవేట్ మాస్టర్స్ వీవర్స్ వద్ద నేత నేస్తున్న పెద్ద కార్మికులకు, చేనేతపై ఆధారపడిపని చేస్తున్న ఉప వృత్తుల వారికి ఈ పథకం వర్తింపజేయాలని కోరారు. డైయింగ్, అద్దకం, ఆతకడం, కండెలు చుట్టడం.. ఇలా ఉప వృత్తుల వారికి కూడా ఉచిత కరెంటు పథకాన్ని అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

ఆప్కో చేనేత వస్త్రాలపై 30 శాతం తగ్గింపు

కొరిటెపాడు(గుంటూరు): ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకొని అన్ని రకాల ఆప్కో చేనేత వస్త్రాలపై 30 శాతం ప్రత్యేక తగ్గింపును అమలు చేస్తున్నట్లు విజయవాడ మండల వాణిజ్య అధికారి డి.వెంకటేశ్వర్లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కొన్ని రకాల చేనేత వస్త్రాలపై 50 శాతం వరకు తగ్గింపు ఇస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా ప్రజలంతా తమకు సమీపంలోని ఆప్కో విక్రయశాలలను సందర్శించాలని ఆయన కోరారు. వెంకటగిరి, మాధవరం, రాజమండ్రి, బందరు, చీరాల, ఉప్పాడ చీరలు, ధోవతులు, దుప్పట్లు, లుంగీలు, షర్టింగ్, టవల్స్ తదితర వస్త్రాలను కొనుగోలు చేసి చేనేత పరిశ్రమను ప్రోత్సహించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

నాటక కళ పరిరక్షణ అందరి బాధ్యత



పురస్కారాలతో కళాకారులు

- మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు
- పలువురికి రంగస్థల, ఉగాది పురస్కారాలు ప్రదానం

నగరంపాలెం: నాటక కళ పరిరక్షణ అందరి బాధ్యతని మిర్చి యార్డు మాజీ చైర్మన్ మన్నవ సుబ్బారావు అన్నారు. ప్రపంచ రంగస్థల దినోత్సవం సందర్భంగా బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయం అన్నమయ్య కళావేదికపై కళ విపంచి (హైదరాబాద్), ఆరాధన ఆర్ట్స్ అకాడమి (గుంటూరు), నటరత్న ఎన్.టి.ఆర్. కళాపరిషత్ సంయుక్తంగా రెండు రోజులపాటు నిర్వహించనున్న రంగస్థల పురస్కారాల సభ గురువారం రాత్రి ప్రారంభమైంది. పిన్నమనేని మృత్యుంజయరావును గురజాడ పురస్కారం, ఐద వరాజు జయశంకరకు బళ్లారి రాఘవ పురస్కారం, వైలేతి ఆచార్యులకు పీఎస్ఆర్ పురస్కారం, సుంకర కోటేశ్వరరావుకు గరికపాటి రాజారావు పురస్కారం, సురభి సంతోష్‌కు గోవిందరావు పురస్కారం, తిరుమలశెట్టి శివరామమూర్తి పురస్కారం, డాక్టర్ ముత్తవరపు సురేష్‌బాబుకి వై.కె.నాగేశ్వరరావు పురస్కారం, జ్యోతిక జాముల రాయలు పురస్కారం, మల్లాది భాస్కర్‌కు జంధ్యాల పురస్కారం అందించి, సత్కరించారు. తొలుత ఆలాపన వెంకటేశ్వరరావు, మునిపల్లె రమణ సినీ భక్తి గీతాలు ఆలపించారు. రచయిత, సినీ నటుడు యు.సుబ్బరాయశర్మ, డాక్టర్ ఎస్.రామచంద్రరావు, ఆలయ పాలకమండలి అధ్యక్షుడు సీహెచ్.మస్తానయ్య, కళాపోషకుడు నూతక్కి లక్ష్మీ సాంబయ్య, ఉప కార్యదర్శి వుటుకూరి నాగేశ్వరరావు ప్రసంగించారు. కార్యక్రమాలను బొప్పన నరసింహారావు, డి.తిరుమలేశ్వరరావు, సడిపల్లె వెంకటేశ్వరరావు, భాగి శివకుమార్, జీవీజీ శంకర్, నయ్యద్ జానీబాషా, వుటుకూరి నాగేశ్వరరావు పర్యవేక్షించారు.

నృసింహుని హుండీ ఆదాయం రూ. 38.70 లక్షలు



మంగళగిరి టౌన్: పట్టణంలోని శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయ హుండీలను గురువారం దేవాదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో సిబ్బంది లెక్కించారు. దేవస్థానానికి సంబంధించి ఎగువ, దిగువ సన్నిధులు, ఘాట్ రోడ్డులో ఉన్న శ్రీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయాలకు మొత్తం రూ. 38,70,176ను వచ్చినట్లు అధికారులు పేర్కొన్నారు. ఎగువ సన్నిధి హుండీ ఆదాయం రూ.16,13,384, దిగువ సన్నిధి హుండీ ఆదాయం రూ. 21,76,972, ఘాట్ రోడ్డులోని శ్రీ పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ హుండీ ఆదాయం రూ. 43,011తో పాటు అన్నదానానికి రూ. 36,809 వచ్చినట్లు సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి రామకోటిరెడ్డి తెలిపారు. గతంలో మూడు నెలలకు గాను రూ. 50,97,560 వచ్చిందని, ఇప్పుడు ఐదు నెలలు ముందుగా లెక్కింపు కారణంగా రూ. 12,27,844 తక్కువ వచ్చినట్లు ఆయన వివరించారు. లెక్కింపును కాజ గ్రూప్ దేవస్థాన కార్యనిర్వహణాధికారి పి. వెంకటరెడ్డి పర్యవేక్షించారు.